

వంద మాటలు చెప్పే కంటే ఒక మంచి
పని చేసి చూపడమే మేలు...
- కందుకూరి వీరేశలింగం

# జనస్వరం
అక్షరమే ఆయుధం ✍

www. Janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి :**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రికలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పబ్లిసిటీ కొరకు అడ్వర్టయిజ్మెంట్ జన్మదిన శుభాకాంక్షలతో పాటు మరియు ఇతర అన్ని రకముల కార్య క్రమాలతో వగైరా ప్రకటనలు ఇవ్వండి. మరిన్ని వివరములకు మా మెయిల్ ఐడి janaswaramnews@gmail.com ను సంప్రదించండి.

సంపుటి : 01 | సంచిక : 16 | ఎడిటర్ : నరేష్ సాకే | వారసంచిక ( 25-10-2020 ) | పేజీలు : 6

**జనస్వరం ఈ-వార పత్రిక పాఠక దేవుళ్ళకు విజయదశమి శుభాకాంక్షలు**

## రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఆత్మకూరు జనసేన నాయకుడు నలిశెట్టి శ్రీధర్ 5 రోజుల పాటు సాగిన ఆమరణ నిరాహార దీక్ష



నెల్లూరు ( జనస్వరం ) : ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆమరణ నిరాహార దీక్ష చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నేటి వరకు, సాగునీటి రంగంలోగాని, పారిశ్రామిక రంగంలోగాని, మౌలిక వసతుల కల్పన రంగంలోగాని, ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం పట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా అయితే నేమి, ఆత్మకూరు ప్రాంత ప్రజలు తీవ్ర వివక్షకు, నిర్లక్ష్యానికి గురైనారు. దశాబ్దాలుగా దగాపడ్డ ఆత్మకూరు ప్రాంత ప్రజల గొంతుకై జనసేన పార్టీ గళమెత్తింది. దశాబ్దాలుగా దగాపడ్డ యువత పిడికిలై జనసేన పోరుబాట పట్టింది. ఈ పోరాటంలో భాగంగా ఆమరణ నిరాహార దీక్షకు, జనసేన పార్టీ శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికై జనసేన పార్టీ ( మిగతా 3 లో )

## రూ. 1,00,00,000
### తెలంగాణ వరద బాధితుల కోసం జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ సాయం



న్యూస్ ( జనస్వరం ) : వరదలు, భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన హైదరాబాద్ ప్రజలకు అండగా ఉండేందుకు జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కోటి రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ “కరోనా మూలంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ కుదేలయిపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారీ వర్షాలు, వరదలు తోడయ్యాయి. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల మూలంగా రెండు తెలుగు రాష్ట్రాలు ఇబ్బందులు పాలవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా లేనంత వర్షపాతం దేశం మొత్తం చూసింది. తెలంగాణలో దీని తాకిడి మరింత ఎక్కువగా ఉంది. హైదరాబాదులో ఇళ్ళలోకి నీళ్ళు వచ్చేసి ఆస్తి నష్టం జరిగింది. చాలామంది జీవన విధానం చిన్నాభిన్నం అయింది. గత కొన్ని దశాబ్దాలుగా టౌన్ ప్లానింగ్ సరిగా లేకపోవడం ఒక కారణం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రజలు పడుతున్న కష్టాలు చూసి... ప్రజలకు సహాయ కార్యక్రమాలు చేస్తున్నందుకు తెలంగాణ ప్రభుత్వానికి కోటి రూపాయలు విరాళం అందించారు.

## శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల నియోజకవర్గంలో జనసేన కార్యాలయం ఏర్పాటు




న్యూస్ ( జనస్వరం ) : ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన కార్యకర్తల కల నెరవేరింది. ఎచ్చర్ల మండలంలో వెంకటేశ్వర కాలేజ్ ఎదురుగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేడపైన నూతన పార్టీ కార్యాలయం గౌరవనీయులు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర రావు గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జి. సిగడాం మండలం నుండి 50 కుటుంబాలు జనసేన పార్టీలో చేరడం జరిగింది. నియోజకవర్గంలో దశాబ్దాలుగా పేరుకుపోయి ఉన్న సమస్యలను గుర్తించి వాటిపై కార్యాచరణ ప్రణాళికను నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి మరియు నియోజకవర్గ నాలుగు మండలాల నుండి వందలాది నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి చర్యలు పై శివశంకర్ గారు దిశానిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పర్యావరణ రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర జనసేన బూత్ కమిటీ సభ్యులు సతీష్ గారు, ఉత్తరాంధ్ర బిజెపి జనసేన సంయుక్త కమిటీ సభ్యులు పేడాడ రామ్మోహన్ రావు గారు, ఎచ్చర్ల ఇంచార్జ్ శ్రీ కాంతి శ్రీ గారు, విశ్వక్ మరియు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదులోని వరద ప్రాంతాలలో పర్యటించిన జనసేన నాయకులు, జనసైనికులు




తెలంగాణ ( జనస్వరం) : హైదరాబాద్ లోని వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటించిన జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంఛార్జ్ శ్రీ శంకర్ గౌడ్ గారు మరియు గ్రేటర్ హైదరాబాద్ జనసేన నాయకులు, జనసైనికులు. అలాగే జనసైనికులు తమ స్వంత నిధులతో వరద బాధితులకు ఆహార పొట్లాలు అందించడం జరిగింది. జనసేనాని పిలుపు మేరకు జనసైనికులు ముంపు ప్రాంతాలలో సహాయ కార్యక్రమాలు చేపట్టారు.

## అత్యాచార కేసుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరిన జనసేన వీర మహిళలు




న్యూస్ ( జనస్వరం ) రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు గ్రామం నందు జరిగిన మరో అతి దారుణమైన సంఘటన 6 సంవత్సరాల పసికందును 24 సంవత్సరాల వయస్కుడు (వ్యక్తి) కులూరు వరహాలు అనే అప్పన్న అత్యాచారం చేసి పారిపోయాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో, విషయం తెలుసుకున్న వీరమహిళలు వెంటనే 2టౌన్ నుంచి స్థానిక GGH యందు కాకినాడ మాజీ మేయర్ మరియు రాష్ట్ర లోకల్ ఎలక్షన్ కమిటీ మెంబెర్ శ్రీమతి సరోజ పొలసపల్లి గారు మరియు వీరమహిళలు జయ ముత్యాల, రమ్యజ్యోతి పిల్లా, కృష్ణవేణి సుంకర, జ్యోతి దాలే, కిరణ్ గార్లు అక్కడికి వెళ్లి పసిపాపను మరియు బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లి, అక్కడ దిశా సెంటర్ నందు సంరక్షకులతో వివరాలను అడిగి ఆ బాధిత కుటుంబం తరుపున వారికి సత్వర న్యాయం జరగాలని ( వివరాలు 4 లో )



సంపాదకీయం

# అవస్థలో విద్యా వ్యవస్థ



ప్రతీ ఒక్కరూ ముందుగా రాజకీయాలను పక్కనబెట్టి ఒకసారి సామాజిక, ఆర్థిక విషయాలపై దృష్టిపెడితే జరుగుతున్న పరిణామాలు, అవి ప్రజలపై మోపే భారాలు అర్థమవుతాయి. అయితే ఇది అర్థం చేసుకోవడానికి రాష్ట్ర పౌరుడి ఆలోచనా ధోరణిని కూడా మనం అవలోకనం చేసుకోవాలి. గతంతో పోల్చుకుంటే అక్షరాస్యత శాతం మెరుగుపడుతుందని చెప్పుకుంటున్న మనం ఆ అక్షరాస్యతలో నైపుణ్యం దాని ద్వారా లభించే సృజనాత్మకతను విస్మరించాం. ఇది సామాజిక కోణంలో కూడా చాలావరకూ ఆందోళన కలిగించే అంశంగా పరిణమిస్తుంది. ఇప్పటికే ఉపాధికల్పన విషయంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల తీరు, ప్రపంచీకరణలో వారి దేశ పౌరులకే ప్రాధాన్యతనిచ్చే కోణంలో జరిగే మార్పులు, దేశ ఆర్థిక వనరులు వినియోగంపై సహేతుకమైన నిర్ణయాలలో వైఫల్యం కారణంగా మరింత ఎక్కువగా నిరుద్యోగం పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనదేశంలోని చాలా రాష్ట్రాలలో ప్రజల ఉపాధి కల్పన కన్నా పథకాలను ఎరగా చేసుకుని ఓటరుపై ఆర్థికంగా ఆదుకుంటున్నామంటూ మభ్యపెట్టి తిరిగి ఆర్థికలోటును పూడ్చడానికి పన్నుల రూపంలోనో, చార్జీల పెంపు రూపంలోనో మరల ప్రజల నుండే వసూలు చేస్తూ ప్రజలు గ్రహించలేని విధంగా చేసి, గ్రహించినా తిరిగి ప్రశ్నించలేని విధంగా చేస్తున్నారు. ఇది ప్రజా సంక్షేమంగా మనం పరిగణించలేము కదా!! మనసుకు కష్టమైనా స్పష్టంగా చెప్పాలంటే ఇది క్షామం. దీనిని ప్రతీ పౌరుడూ తీక్షణంగా దేశ, రాష్ట్ర స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి రాబోవు తరాలకు ఈ పెనుముప్పు తప్పేటట్టుగా ఆలోచించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసివస్తుంది..

ఒకసారి ఆ అంశాలలోకి వస్తే విద్యావ్యవస్థలో మార్పులకు బదులుగా, పిల్లల చదువులకోసం తలిదండ్రుల ఆర్థిక స్థితిపైన భారం తగ్గించడానికి బదులుగా ఆర్థికంగా ఆసరా అవుతున్నామనే నెపంతో వారికి పథకం పేరు మీద నగదు బదిలీ చేస్తున్నారు. చివరకు మాతృభాష బోధన విషయంలో కూడా ఆంగ్లం రాకపోవడం ఉపాధికి అవరోధమనే విషయంగా ప్రజలను ఏమార్చి మానసిక వికాసానికి దూరం చేస్తున్నారు. పాఠశాలలలో కనీస అవసరాలు, వారి సృజనాత్మకతకు దోహదపడేవిధంగా పాఠ్యాంశాల మార్పులు తీసుకువచ్చే ప్రణాళికలు లేకుండా తలిదండ్రుల ఓట్ల కోసం పిల్లల భవిష్యత్తుకు భరోసానివ్వలేని కార్యక్రమాలు చేపడుతున్నారు, అంతేగాక సరైన మరుగుదొడ్లు, ఆటస్థలం కూడా లేని పాఠశాలలు కోకొల్లలు. ఇటువంటి కనీస అవసరాలను తీర్చకుండా ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు పిల్లలకు ఏ విధంగా ఆసరా అవుతాయి.

ఇప్పటికీ సాంప్రదాయబద్ధమైన కోర్సులు లేదా ఇంజనీరింగ్ కోర్సులపైనే ఆసక్తి కనబరుస్తున్న ఈ తరుణంలో ఎక్కువ మంది అదే కోర్సులపై మక్కువ చూపిస్తున్నప్పుడు ఎదురయ్యే అంశాలపై కూడా ప్రభుత్వాలు ఒక సహేతుకమైన విధివిధానాలు రూపొందించలేకుంటే ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పట్టభద్రులను సమాజం పొందలేదు. ఇప్పటికే చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం లేకపోవడం ఒక వంతైతే చేస్తున్న పనికి, చదివిన చదువుకీ సంబంధం లేకుండా విధులు నిర్వర్తించడం ఒకవంతయ్యింది.

కేవలం ఉద్యోగం, తద్వార సంపాదనే ధ్యేయంగా చేసుకుని కొనసాగుతున్న ఈ విద్యావ్యవస్థలో సామాజిక న్యాయం, దేశ పౌరుడిగా నిర్వర్తించవలసిన కనీస ధర్మాలను విడిచిపెట్టేస్తున్నాం. క్రమశిక్షణను అలవరచలేని చదువులతో ఇటు తలిదండ్రులు, గురువులు, సమాజంకూడా ఆందోళనచెందే పరిస్థితులలోనికి మనకి మనంగా నెట్టివేయబడుతున్నాం. తల్లిదండ్రుల ఈ ధోరణే రేపటి వారి పిల్లలే వారిపై వృధ్యాప్యంలో చూపించే వివక్షకు కారణమవుతుంది. వృత్తి విద్యాకోర్సులను స్థాపించి నూతన ఆవిష్కరణలకు అవకాశాలను కల్పించాలి. అధ్యాపకుల ఎంపికలో జరుగుతున్న విధానాలను పునఃసమీక్ష చేసుకుని ఉత్తమ విద్య పిల్లలకు అందేటట్లుగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. చదువు చెప్పేందుకు సిద్ధపడిన తర్వాత చదువుకునే రీతిగా సాగే ఇప్పటి అధ్యాపక విధానాలలో ఆ అధ్యాపకుడి ఉత్తీర్ణతా పరంపరలోని మార్కులను (గుణాలను) కూడా పరిగణలోనికి తీసుకోవాలి.

ఇక ఉపాధి విషయానికొస్తే నైపుణ్యత లేని పట్టాలు అందుకుని ఎంతో మంది యువత నిరుద్యోగులుగా జీవనాన్ని సాగిస్తున్నారు. గడిచిన 20 సం.రాలలో 10 వ తరగతి ఉత్తీర్ణతా శాతం 50 నుండి 90 వరకూ పెరిగినా నైపుణ్యతా శాతం అంత ఆశాజనకంగాలేదు, ఇంకా చెప్పాలంటే, తలిదండ్రులు కష్టమైనా 10+2 లో ప్రైవేట్ కాలేజీలలో చదివించడానికి మక్కువ చూపి వారి ఆర్థిక పరిస్థితిని దిగజార్చుకుంటున్నారు. ఒక ఇంటిలో ఇద్దరు పిల్లలను చదివించడానికి నెలకు వారికి అయ్యే ఖర్చు ఆ కుటుంబ పోషణార్థం నెలకు అయ్యే ఖర్చు రమారమీ సమానం. ఇటువంటి స్థితిలో ఆర్థిక అసమానతలు రూపుమాపడం ఎవరివల్లా కూడా సాధ్యపడదు. ఎంతమంది ఈ ప్రైవేట్ కాలేజీలలోని విద్యార్థులు ఉపాధి పొందుతున్నారనేది ప్రశ్నార్థకమే. ప్రభుత్వాలు ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు కుమ్మక్కై ఈ పరిస్థితులకు బీజం వేసారు, ఆ పరిస్థితే ఇప్పుడు నిర్వీర్యమైన సమాజానికి హేతువయ్యింది. ఇది గ్రహించే స్థితిలో తలిదండ్రులు లేరు. పూర్తిగా విద్యావ్యవస్థను మాయాజాలం చేసి ఉపాధి కల్పించలేని వారి పోకడలకు రంగులు పూసి మభ్యపెట్టి కాలం వెల్లదీస్తున్నారు. ఈ ప్రమాదాన్ని అంచనా వేయగల సామర్థ్యం ప్రజలకు లేకుండా చేసి పథకాలు, కులం, మతం అనే స్వార్థాల నీడలో వారి పబ్బం గడుపుకుంటున్నారు. ఈ పరిస్థితిని చక్కబెట్టాలంటే ఒక యజ్ఞంగా కొన్ని సంవత్సరాలు సాగితే తప్ప ఈ రాబోయే భయంకర విపత్తుని ఎదుర్కోలేము. రాజకీయనేతలే రాజ్యాంగేతర శక్తులుగా మారి దేశం, రాష్ట్రాల భవిష్యత్తుని అంధకారంలోనికి నెట్టేస్తున్నారు. దేశ సామాజిక, సాంప్రదాయాల విషయంలో విభిన్నమైనపోకడలు విద్యావ్యవస్థ పనితీరుపై ఎటువంటి ఆలోచనలూ లేకుండా చేస్తున్నాయి.. మనిషిలో సహజత్వంపై ప్రభావం కూడా చూపే విధంగా సాగే ఈ దాష్టికం ఇలానే కొనసాగితే తద్ఫలితంగా జరిగే వికృతాలకు ఎవరు బాధ్యత వహిస్తారనేదే అంతుచిక్కని ప్రశ్న.

వీటన్నిటికి చక్కని పరిష్కారం విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావడమే. నాణ్యమైన విద్యను ప్రతీ విద్యార్థికీ ఉచితంగానే అందించి, ఈ ఓటు బ్యాంక్ రాజకీయాలకై ఈ పాలకులు పంచే పథకాల ధనాన్ని ఉచిత విద్యను అందించే దిశగా చేపట్టి తలిదండ్రులపై పూర్తి స్థాయిగా ఆ భారాన్ని తీసివేయగలిగితే వారి ఆర్థికస్థితి మెరుగుపడడమే కాకుండా పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కటి పోటీ తత్వాన్ని నేర్పడంతో పాటూ భవిష్యత్తులో వారి కుటుంబ జీవనప్రమాణాలు మెరుగుపడే అవకాశాన్ని ఇచ్చే పరిస్థితి ఏర్పడుతుంది.

ఇది ఇలా ఉంటే, ప్రైవేటు విద్యా రంగంలోని యాజమాన్యాలు పూర్తిగా విద్య ఆర్థికపరమైన అంశంగానూ వారి ఉనికికై చేసే ప్రయాసగానూ మారిపోయింది తప్ప సమాజంపై కాసింత కూడా మమకారఛాయలు లేవు. రాజకీయ కనుసన్నలలోనో, స్వయంగా రాజకీయనాయకుల చేతులలోనో నడిచే ఈ ప్రైవేటు విద్యావ్యవస్థలు సమాజానికి ఏ మేరకు ఉపయోగపడతాయో అర్థం చేసుకోవాలి. ప్రజలచే ఎన్నుకోబడిన ఒక ప్రజాప్రతినిధి విద్యను అంగంట్లో అమ్మే క్రూరమైన చర్యకు సమాధానం దొరుకుతుందా.?? తను నడిపే ఆ సంస్థ ఉన్నతికి విద్యార్థులపై తీవ్రమానసిక ఒత్తిడిని తెచ్చి రాంకుల మాయలతో అటు తలిదండ్రులని, విద్యార్థులనీ దూరపుకొండలు చూపిస్తూ, సమాజంలో క్రీడను నడుపుతున్నారు.

తల్లిదండ్రులు కూడా ప్రస్తుత సామాజిక పరిస్థితులు, తమ పిల్లలను చదివించబోయే, వారు చదువుతానన్న కోర్సులపై కాస్తైనా అవగాహన కలిగించుకుని ఆ విధంగా ప్రణాళికలు చేసుకోవాలి. వీటన్నిటికంటే ముందు తమ పిల్లలకు ఆ చదివే కోర్సు పట్ల ఆసక్తి కనబరుస్తున్నాడా లేదా అనేది కూడా తలిదండ్రులు గమనించాలి. పిల్లలకు ఇష్టమైన కోర్సుల్లో చేర్పించి తద్వారా వారు ఆయా రంగాల్లో ఎదిగేలా ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు కూడా విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చి, విభిన్న రంగాల్లో విద్యార్థులు ఎదిగేలా విద్యా వ్యవస్థను రూపు మాపాలి. విద్య అనేది ఒక ప్రాథమిక హక్కుగా భావించి మనం ఆ హక్కును వినియోగించుకునేలా చేయాలి. చదువుకునే వయసులో వారికి కలిగే భిన్నమైన అభి ప్రాయాలకు కళ్ళెం వేస్తూనే నడవడికను సరిచేయాలి. తలిదండ్రులు, గురువులు కూడా వారు చేపట్టిన ఈ బాధ్యతను రాబోవుతరాలు సాంఘికన్యాయంగాజీవనంకొనసాగించేటట్టుగా తీర్చిదిద్ది దేశ ప్రగతికి బాటలు వేసే దారులను ఏర్పరచాలి. దీనికి తోడుగా ప్రభుత్వమే చిన్న తరహా పరిశ్రమలకు చేయూతనందించి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో మన దేశ ఉత్పత్తులకు వాటికి సంబంధించిన యంత్రాల, ముడిసరుకు దిగుమతులలో రాయితీలను అందించి నిరుద్యోగ నిర్మూలనకు తగు విధమైన ప్రణాళికలు రూపొందించి ప్రతి పౌరుడి ఆర్థిక భరోసాకి తగినటువంటి అవకాశాలు కల్పించకపోతే అసహనంతో కూడుకున్న వ్యవస్థలో అందరూ దోషులుగా నిలబడాల్సివస్తుంది.

రాజకీయాలను యువత అవకాశవాద, దోపిడీ వ్యవస్థగా పరిగణించి ఆ వైపుగా జరిగే అన్యాయాలకు స్పందించడం కూడా మానివేసే జరిగే చోద్యంలో కొంతమంది వారి ప్రయోజనాలకు దాసులైపోతున్నారు. ఇదే సమయంలో చట్టాలపై నమ్మకం కోల్పోతున్న సామాన్యుడి ఆలోచన కష్టపడకుండానే సంపాదన మార్గాలను అన్వేషిస్తూ పూర్తిగా సమాజంపై నమ్మకం కోల్పోయే పరిస్థితికి తెస్తున్నాడు. రాజకీయాలకు అతీతంగా నడపాల్సిన సామాజిక అంశాలను వారి స్వార్థాలకు ముడిపెడుతూ పెడదారి పట్టించే ఈ రాజకీయ నాయకులకు వారిపై గల అక్రమాస్తులు, నేరారోపణలపై తగిన శిక్షలు అమలుపరిచి చట్టం అందరికి ఒకే విధంగా వ్యవహరిస్తుందనే నమ్మకం కలిగించకపోతే ఇప్పటికే ఉదాసీనంగా ఉన్న సామాన్యుడి ఆలోచన చచ్చిపోయి ఎవరికీ ఉపయోగంలేని కళేబరంగా మారిపోతే దేశానికి ప్రమాదం కూడా.

చట్టసభలలో చట్టాలు సామాన్యుడికే అన్న భావం ఇప్పటికే ప్రజలలో బలంగా నాటుకుపోయింది. ఐతే ఆ పరిస్థితిని చక్కబెట్టడానికి దేశంపై మమకారమున్న ఒక ధర్మబద్ధమైన నాయకుడు పగ్గాలు చేపట్టి పూర్తిప్రక్షాళన చేస్తే తప్ప సామాన్యుడు మన ప్రజాస్వామిక జీవనగతిలో ఫలాలు పొందలేడు.

by
భాను శ్రీమేఘన.
ట్విట్టర్ ఐడి : @ravikranthi9273

## ఆత్మకూరులో ఆమరణ నిరాహార దీక్ష

( మొదటి పేజీ తరువాయి )

సుమారు 100 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించిన సంగతి అందరికీ విదితమే.

1) ఈ ప్రాంత రైతాంగం యొక్క అతిపెద్ద సమస్య, చుక్కల భూముల సమస్య. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఒక్కనెల్లూరు జిల్లా మినహా, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో, ఈ సమస్య, రైతుల అర్జీలతో నిమిత్తం లేకుండా సుమోటోగా పరిష్కారమైంది. నెల్లూరు జిల్లాలో మాత్రం, నేతలు మారినా రైతన్నల తలరాతలు మారలేదు. జిల్లా వ్యాప్తంగా, చుక్కల చిక్కుల్లో నలిగిపోతున్న 37,268 అన్నదాతల ఆక్రందనకు రూపమే, ఈ ఆమరణ నిరాహార దీక్ష.

2) నెల్లూరు జిల్లా వరప్రదాయని సోమశిల జలాశయం, ఆత్మకూరు నియోజకవర్గంలో ఉంది. ఈ జలాశయం నుండి నెల్లూరు జిల్లాలోని డెల్టా ప్రాంతానికి, పక్క జిల్లాలకు మరియు పక్క రాష్ట్రానికి సాగు తాగునీటి సరఫరా జరుగుతుంది. సోమశిల జలాశయం జలాలతో, మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలోని, అన్నీ చెరువులను నింపే ప్రణాళికను రూపొందించాలన్న, ఈ ప్రాంత రైతాంగం యొక్క చిరకాల ఆకాంక్ష సాధనకు రూపమే ఈ ఆమరణ నిరాహార దీక్ష.

3) శాస్త్ర,సాంకేతిక,యాంత్రిక పరిజ్ఞానం అంతగా లేని బ్రిటిష్ పాలనలో 1885 సంవత్సరములో, కేవలం ఆరు సంవత్సరాల కాలంలో సంగం ఆనకట్టను నిర్మించడం జరిగింది. శాస్త్ర, సాంకేతిక, యాంత్రిక పరిజ్ఞానం పుష్కలంగా ఉన్న, నేటి రోజుల్లో పుష్కరకాలం క్రితం శంకుస్థాపన జరిగిన సంగం బ్యారేజీ నేటికీ నిర్మాణ దశలోనే ఉందంటే, ఈ ప్రాంత రైతాంగం పట్ల పాలకుల నిర్లక్ష్యం, ఏ స్థాయిలో ఉందో, చెప్పకనే చెబుతుంది. సంగం బ్యారేజీ త్వరగా పూర్తి చేయాలని, మరియు సంగం బ్యారేజీ బ్యాక్ వాటర్ నుండి ఆత్మకూరు నియోజకవర్గంలోని మెట్ట ప్రాంతాలకు సాగునీటి ప్రణాళికలను రూపొందించాలన్న, ఈ ప్రాంత రైతాంగం యొక్క ఆశల, ఆశయ సాధనకు రూపమే ఈ ఆమరణ నిరాహార దీక్ష.

4) స్వాతంత్రం వచ్చిన తరువాత మొట్టమొదటిసారిగా ఆత్మకూరు నియోజకవర్గం లోని మెట్ట ప్రాంత, ఆయకట్టు కోసం రూపొందించబడిన మొట్టమొదటి సాగునీటి ప్రణాళిక, ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్. దశాబ్ద కాలం క్రితం శంకుస్థాపన జరిగిన ఈ ప్రాజెక్టు, పాలకుల నిర్లక్ష్యం, నిధుల లేమి వెరసి పనులు పూర్తిగా నిలిచిపోయివున్నది. ఈ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందా తమ బతుకులు ఎప్పుడూ బాగుపడతాయా అని, ఆశతో ఎదురు చూస్తున్న మెట్ట ప్రాంత రైతాంగ చిరకాల స్వప్న సహకారానికిరూపమే,ఈఆమరణనిరాహారదీక్ష.

5) ఈ ప్రాంత ప్రజలు మరియు రైతాంగం యొక్క ఐదు దశాబ్దాల కల, శ్రీకాళహస్తి – నడికుడి రైల్వే మార్గం. దశాబ్దాల పోరాట ఫలితంగా 2012లో ఈ రైల్వే నిర్మాణానికి సాంకేతిక అనుమతి లభించినప్పటికీ, 2018 వరకు నిధులు మంజూరు జరగలేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందంలో భాగంగా ఈ రైల్వే నిర్మాణానికి అవసరమైన భూమిని మొత్తం, రాష్ట్ర ప్రభుత్వమే సేకరించి రైల్వే శాఖకు అప్పగించాల్సి ఉంది. జిల్లాలో మెట్ట ప్రాంతమైన, ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో దోహద పడే ఈ ప్రాజెక్టుకు, నెల్లూరు జిల్లాలో నేటి వరకు ఒక్క సెంటు భూమిని కూడా సేకరించి, రైల్వేశాఖకు అప్పగించడం జరగలేదు.

6) చెప్పుకోదగ్గ ఒక్క పరిశ్రమ కూడా, మెట్ట ప్రాంతమైన ఆత్మకూరు నియోజకవర్గంలో ఏర్పాటు కాలేదు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే, ఈ ప్రాంత యువత యొక్క, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి అన్న, యువతరం ఆశల ఆశయ సాధన రూపమే, ఈ ఆమరణ నిరాహార దీక్ష.

5 రోజుల పాటు సాగిన ఈ ఆమరణ నిరాహార దీక్ష జిల్లా అధికారుల దృష్టికి వెళ్లడంతో, సదరు అధికారుల సూచనల మేరకు స్థానిక తహసీల్దారు కృష్ణ ప్రసాద్, ఎస్ ఐ రవి నాయక్ లు శ్రీధర్ వద్దకు వచ్చి చర్చలు జరిపారు. ఈ సమస్యల్లో తమ పరిధిలో వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శ్రీధర్ సమ్మతించగా నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రి చీకటిలో ఇబ్బంది పడుతున్న గర్భిని వార్డులకు స్వంత నిధులతో జనరేటర్ ఏర్పాటు చేసిన జనసేన నాయకులు దాసరి రాజు



శ్రీకాకుళం ( జనస్వరం ) : సొంత ఖర్చులతో ప్రభుత్వ ఆసుపత్రికి జనరేటర్ ఏర్పాటు చేసి, నీరందించిన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసైనికులు, జనసేన సమన్వయకర్త శ్రీ దాసరి రాజు గారు. 3 రోజులుగా కరెంటు లేని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రి. జనరేటర్ ఏర్పాటు చేయని ఆసుపత్రి సిబ్బంది. కరెంటే కాదు నీళ్ళు కూడా లేక తీవ్ర ఇబ్బందులు, అవస్థలు పడుతున్న రోగులు, గర్భిణీలు స్త్రీలు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్య ధోరణి చూసి సొంత డబ్బుతో జనరేటర్ ఏర్పాటు చేసి, 8ట్యాంకర్ల నీరు అందించిన జనసైనికులు మరియు ఇచ్ఛాపురం జనసేన సమన్వయకర్త శ్రీ దాసరి రాజు గారు. రోగులు దాసరి రాజు చేస్తున్న సహాయాన్ని మానవత్వంతో అభినందించారు.

## సచివాలయంలో పేదలకు న్యాయం కన్నా రాజకీయాలే ఎక్కువ: మాకినీడి శేషు కుమారి



కాకినాడ ( జనస్వరం) : కాకినాడ 38వ వార్డు సచివాలయంలో రోజుకో రాజకీయం జరుగుతోందని స్థానిక ప్రజలు అంటున్నారు. జగన్ సర్కార్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ కొన్ని సచివాలయాల్లో పేదలకు అన్యాయం తప్ప న్యాయం జరిగే రోజు కానరావడం లేదు. కాకినాడ అ పట్టణంలోని ముఖ్యంగా శ్రీమతి మాకినీడి శేషు కుమారి గారు కౌన్సిలర్ గా ఉన్న 38వ వార్డు లో పేదల పడుతున్న కష్టాలు అంతా ఇంతా కాదు చివరికి రోడ్డెక్కి మీడియా ముందుకు వచ్చి చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇళ్ల పట్టాల విషయంలో సమన్యాయం చేయకుండా వారికి కావలసిన వారికి పేరు నమోదు చేసుకుని వైయస్సార్ పార్టీకి సంబంధించిన వారు కాదు అని ముద్రవేసి పేరు నమోదు చేసుకోకుండా బయటకు నెట్టడం జరుగుతుంది అని తమ ఆవేదన వ్యక్తంచేశారు స్థానిక ప్రజలు. ఈ వాలంటరీ వ్యవస్థ రాకముందు శ్రీమతి మాకినీడి శేషు కుమారి గారు మాకు ప్రతి విషయంలోనూ న్యాయం చేశారని ఇప్పుడు ఈ వాలంటరీ వ్యవస్థ వచ్చి వాళ్ల మనుషులు మాత్రమే న్యాయం చేసుకుని మిగతా వాళ్ళకి అన్యాయం చేస్తున్నారని మాకు ఈ వాలంటరీ వ్యవస్థ కంటే శ్రీమతి శేషు కుమారి గారికి ఆధ్వర్యంలో ఈ పనులన్నీ జరిగితే ప్రతి పేదవారికి న్యాయం జరుగుతుందని 38వ వార్డు ప్రజలుగా మేమందరం కోరుకుంటున్నాం అన్నారు. శ్రీమతి మాకినీడి శేషు కుమారి గారు మాట్లాడుతూ వాలంటరీ వ్యవస్థ అనేది రాజకీయ నాయకుల అండదండలతో జరిగేది కాదని, ప్రతి వారిని కూడా నిష్పక్షపాతంగా తమ ఉద్యోగ వృత్తిని కాపాడుకుంటూ ముందుకెళ్లాలని అలా అయితేనే ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని, ఒక వార్డ్ కౌన్సిలర్ గా నేను ఎన్నో కార్యక్రమాలు చేశాను. కానీ ఈవిధమైన వాలంటరీ వ్యవస్థ కోసం నా వార్డు ప్రజలందరూ రోడ్డు పైకి వచ్చి ఇలా మీడియా ముందు బాధపడటం చూసి నేనెంతో చలించిపోయాను. దయచేసి ఇక నుంచి అయినా ప్రతి వాలంటీర్ ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకం ప్రతి పేదవాడికి అందేలా కృషి చేయాలని, లేనియెడల ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ప్రజల తరఫున నేను పోరాడుతానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అని శ్రీమతి మాకినీడి శేషు కుమారి గారు తెలియజేశారు.

## ముంపు ప్రాంతాలను సందర్శించిన గ్రేటర్ జనసేన నాయకులు



తెలంగాణ ( జనస్వరం ) : గ్రేటర్ హైదరాబాదు పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఫాక్స సాగర్ చెరువులో ఉమామహేశ్వరం కాలనీ 642 ఇల్లు పూర్తిగా నీటిలో మునిగి 2500 మంది రోడ్డున పడ్డారు. మళ్లీ భారీ వర్షాలు వస్తే చెరువు కట్ట తెగితే 70 వేల కుటుంబాలు రోడ్డున పడతాయి అని, వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని జనసేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారాం రాజలింగం గారు విజ్ఞప్తి చేశారు.

## మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో దేవి నవరాత్రుల ఉత్సవాలు



న్యూస్ ( జనస్వరం ) : మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో శరన్నవరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీ శివస్వామీజీ పాల్గొని భారతీయ ధర్మం విశిష్టతను తెలిపుతూ, మన ధర్మం, సంస్కృతి విశేషాలను గొప్పగా అందరికీ అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమాలు చూడాలి అనుకుంటే జనసేన పార్టీ యూట్యూబ్ ఛానెల్ లో చూడగలరు. దుర్గా దేవి పూజలో జనసేన నాయకులు, వీర మహిళలు తదితరులు పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

## ఉపాధి కోల్పోయిన ప్రయివేటు టీచర్స్, లెక్చరర్ సమస్యల పరిష్కారం కోసం అవనిగడ్డ జనసైనికుల శాంతియుత పాదయాత్ర



కృష్ణా ( జనస్వరం ) : అవనిగడ్డ నియోజకవర్గం, చల్లపల్లి మండలం కరోనా కారణంగా స్కూల్స్ మూతపడటంతో ఉపాధి కోల్పోయిన ప్రయివేటు టీచర్స్, లెక్చరర్ లు తమ సమస్యలు పరిష్కారం కోసం చల్లపల్లి గాంధీ విగ్రహం నుండి మచిలీపట్నం కలక్టరేట్ వరకు శాంతియుత పాదయాత్ర నిర్వహించారు. వారి సమస్యల పరిష్కారం కోసం మద్దతు గా చేస్తున్న ర్యాలీకి జనసేన పార్టీ, సి.ఐ.టి.యూ, బీజేపీ, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. కరోనా దెబ్బతో స్కూల్స్ తెరవకపోవడంతో ప్రయివేటు టీచర్స్, లెక్చరర్లు జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుకుంటున్నారు. ఈ కరోనా విపత్కర సమయంలో ప్రభుత్వం అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చి, ఇపుడు ప్రైవేట్ టీచర్లను ఆదుకోకపోవడం దారుణం అన్నారు. కొందరు టీచర్లు ఇంట్లో పూట గడవక రోడ్ల మీద పండ్లు అమ్మడం, కూలీ పనులకు వెళ్ళడం చూస్తున్నాం. ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పే గురువులకి ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరం. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి తగిన సహాయం చేయాలని కోరారు.

## అత్యాచార కేసుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరిన జనసేన వీర మహిళలు

( మొదటి పేజీ తరువాయి )

మరియు ఫోక్సో చట్టాన్ని బలంగా అమలపరుస్తూ ఆ వ్యక్తికి సరైన శిక్ష పడే విధంగా సహకారం అందించవలసిందిగా కోరుతూ అలాగే ఆ తల్లికి ధైర్యాన్ని చెబుతూ మేమున్నాం అనే భరోసాను అందించి వచ్చారు. స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీమతి చిన్నారి గారి సమక్షంలో రైటర్ గారు రాసుకుని వారు అడిగిన వాటికి క్లుప్తంగా వివరించడం, వాటిని ఆన్-రికార్డ్ రాసుకున్నారు. తదుపరి కార్యాచరణ FIR నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. ఈ కేసును పరిష్కార దిశగా వేగవంతం చేయాలని కోరారు.

## హిరా మండలం రోడ్లు పట్టించుకోవాలని రోడ్డుపై నిరసన తెలిపిన జనసేన నాయకులు గేదెల చైతన్య



శ్రీకాకుళం ( జనస్వరం ) : తరాలు మారుతున్నాయి, రాజకీయ నాయకులు మారుతున్నారు. ఈపాటికి ఇంకా రోడ్లు తీవ్ర అస్తవ్యస్తంగా ఉన్నాయి. మండల కేంద్రలోనే ఇలా ఉంటే ఇంకా గ్రామాల్లో పరిస్థితి చెప్పే అవసరం లేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే గారు మేలుకొని మీరు ప్రయాణించే రోడ్లు ప్రజలకు బాగా ఉపయోగ పడే రోడ్లు త్వరగా పూర్తి చేయాలి అని పాతపట్నం జనసేన పార్టీ ఇంచార్జి శ్రీ గేదెల చైతన్య గారు రోడ్డు పైన బైఠాయించి నిరశన కార్యక్రమం మరియు మానవహారం చేయడం జరిగినది. వర్షాలు వస్తే గుంతల మయం అయ్యే రోడ్లను స్థానిక ఎమ్మెల్యేలు చూస్తూనే ఉన్నా పట్టించుకోకపోవడం దౌర్భాగ్యం. వాహనదారులకి విపరీతంగా చలానాలు వసూలు చేస్తున్నారు కానీ, అదే వాహనదారుల భద్రతను పట్టించుకోరా అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## వరదల వల్ల పంటలు ముంపుకు గురైన రైతుల్ని కలిసిన జనసేన వీర మహిళ కృష్ణవేణి సుంకర



తూర్పు గోదావరి ( జనస్వరం ) : జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం నియోజకవర్గంలో వరదల వల్ల పంటలు ముంపుకు గురైన కాపవరం గ్రామంలో రైతుల్ని జనసేన వీర మహిళ కృష్ణవేణి సుంకర గారు కలవడం జరిగింది. రైతులు కోల్పోయిన పంటల గురించి, అలాగే కౌలురైతుల సమస్యలని తెలుసుకోవడం జరిగింది. అక్కడ ఒక బ్రిడ్జ్ కూలిపోయి 1 సంవత్సరం అయినా ఇంకా దాన్ని నిర్మించకుండా నిర్లక్ష్యంగా ఉండిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ బ్రిడ్జ్ పక్కన ఒక చిన్న రోడ్డుబాట వేసారు దాని వల్ల ఇరువురి దారుల పక్కన పారుతున్న నీరు రైతుల పొలాల్లోకి వెళ్లిపోతుందని రైతులు కృష్ణవేణి దగ్గర వాపోయారు. దాని వల్ల వరిపంట పొట్ట దశలో ఉండగా అక్కడ వరదనీరు నిల్వ ఉండడం వల్ల వరిపంట కుళ్లిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు.. అక్కడ ఉన్న రైతులు, గ్రామస్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే ఆ బ్రిడ్జ్ ని వెంటనే నిర్మించాలని ప్రభుత్వ అధికారులను కోరుతానని రైతులకు హామీ ఇచ్చారు. అలాగే పంటను కోల్పోయిన రైతులకు-కౌలు రైతులకు తక్షణమే ప్రభుత్వం సహాయాన్ని అందించాలని కృష్ణవేణి సుంకర జనసేన పార్టీ తరుపున డిమాండ్ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాపవరం జనసైనికులు, రైతులు, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## విద్యార్థులకు జాగ్రత్తలు కల్పించి పాఠశాలలు ప్రారంభించాలి : ఎమ్మిగనూరు జనసేన పార్టీ నాయకులు




కర్నూలు ( జనస్వరం ) : ఎమ్మిగనూరు పట్టణంలోని జనసేనపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి రేఖగౌడ్ ఆదేశాలమేరకు జనసేనపార్టీ నాయకులు రాహుల్ సాగర్, గాజుల వెంకటేష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభించే ముందు విద్యార్థులు కరోనా భారిన పడకుండా అన్ని రకాల జాగ్రత్తలతో సదుపాయాలు కల్పించి ప్రారంభించాలని కోరారు. నవంబర్ 2 నుంచి పాఠశాలలు ప్రారంభించే ముందు ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ అధికారుల ద్వారా విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రభుత్వ ఉపాధ్యాయులతో మరియు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు తల్లిదండ్రులకు కరోనా మహమ్మారి గురించి జాగ్రత్తలు వివరించి పునఃప్రారంభించాలని అన్నారు. ఎటువంటి నియమ నిబంధనలు తెలపకుండా పాఠశాలల ప్రారంభపు తేదీలను ప్రకటిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దన్నారు. పాఠశాలల్లో తరగతుల వారిగా బోధన జరపాలని ఒక్కపూట మాత్రమే పాఠశాలలు జరుపుటకు ఎలాంటి ప్రణాళికల ద్వారా ముందుకు పోతున్నారో అర్థం కావడం లేదని ప్రభుత్వ పాఠశాలల్లో గదులకు మించిన విద్యార్థులు ఉన్నారని అరకొర గదులతో సామాజిక దూరం పాటించడం సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. కరోనా బారిన పడకుండా ముందస్తుగా పాఠశాలలకు శానిటైజర్లు, మాస్కులు, పంపిణీ చెయ్యాలని సమయపాలన మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు రాహుల్ సాగర్, రవి ప్రకాష్, షబ్బీర్, పాల్గొన్నారు.

## జనసేన నాయకులు టి.శివశంకర రావు ఆధ్వర్యంలో విశాఖలో 38J బస్సు సేవల కోసం పోరాడి సాధించిన జనసైనికులు



విశాఖపట్నం ( జనస్వరం ) : ఇండస్ట్రియల్ బెల్ట్ కొండ ప్రాంతాలలో (జనతాకాలనీ, ఎ.ఎస్.ఆర్ కాలనీ, అంబేద్కర్ కాలనీ, ఇంద్రనగర్ 12, జవహర్‌నగర్, Ex-servicemen కాలనీ, కోరమండల్) నివసిస్తున్న కార్మికులు, విద్యార్థులు మరియు సీనియర్ సిటిజన్లకు 38J తిరగవలసిన రూట్ లో తిరగకపోవడం వల్ల ఇక్కడ ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి టి. శివశంకర్ గారి ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ నాయకులు పీలా రామకృష్ణ గారు, 60 వార్డ్ అభ్యర్థి చంద్రమౌళి మరియు టీం JCF, టీం ధర్మశాల, ఇంద్రజిత్, అప్పారావు, సత్తి బాబు మరియు జనసైనికులు జనసేన పార్టీ తరుపున 38 J బస్సు సేవలను రెగ్యులర్ మార్గంలో తిరిగి ప్రారంభించాలని 16-10-2020 ఇచ్చిన లేఖకు సంబంధించి, అధికారులు చెప్పిన కారణం అదనపు చెట్ల కొమ్మలు అని, ఆ రూట్లో మేము వెళ్లి చూసి అర్థం చేసుకున్నాము. అందువల్ల మేము జివిఎంసి, APSEB, మరియు హార్టికల్చర్ విభాగానికి ఫిర్యాదు చేసి మరియు సమస్య పరిష్కారం కోసం త్వరగా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ విభాగానికి మేము అభ్యర్థించాము. తద్వారా గత 4 రోజులుగా అధికంగా పెరిగిన చెట్ల కొమ్మలను జనసైనికులు మరియు నాయకులు దగ్గర వుండి కత్తిరించేలా చేసి, ఈ సమస్య పరిష్కరించాము. అందువల్ల 38J బస్సు సేవలను సాధారణ మార్గంలో మళ్లీ తిరిగి ప్రారంభించమని మేము డిపో మేనేజర్ జనసేన పార్టీ తరపున వినతి ఇవ్వడం జరిగింది. డిపో మేనేజర్ మాధవ గారు రేపటి నుంచి బస్ మరలా రెగ్యులర్ రూట్లో తాగడానికి వారి సిబ్బందికి ఉత్తర్వులు జారీచేశారు.

## నందిగామ నియోజకవర్గ — జనసేన పార్టీ శ్రేణుల " విజయఢంకా "



కృష్ణా ( జనస్వరం ) : కంచికచర్ల ESI డిస్పెన్సరీ రద్దు విషయమై, రాష్ట్ర కార్మిక శాఖ అలసత్వం పై నియోజకవర్గ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల పక్షాన గర్జించిన నియోజకవర్గ జనసేన పార్టీ శ్రేణుల విజయం. నందిగామ నియోజకవర్గ దొనబండ క్వారీ వర్కర్స్, కీసర సెంటినీ, ఇన్వెంట, చెన్నరారావు పాలెం స్పెక్ట్రిక్, బాటరీ ఫ్యాక్టరీస్, ముప్పాళ్ల అంబ కోచ్, కాగిత అనుబంధ ఫ్యాక్టరీలు, పెద్దవరం ఫ్యాక్టరీ, ఇంజనీరింగ్, వృత్తి విద్య, డిగ్రీ , ఇంటర్ కాలేజీలు మరియు అప్పర్ ప్రైమరీ, హై స్కూల్స్ (ప్రయివేటు) రిలయన్స్, మోర్, హోండా, వరుణ్, టీవీఎస్, హీరో, క్లాత్ షోరూమ్ లు, ట్రాక్టర్లు షోరూములు, పెట్రోలు బంకులు, సినిమా హాల్సు ఇంకా ఇతర సెక్టార్స్ లో పనిచేయు సంఘటిత, అసంఘటిత కార్మికులకు (ESI చందా చెల్లింపు చేయువారు) వారి కుటుంబ సభ్యులకు ఇది ఒక మంచి శుభవార్త ఇక 30 సంవత్సరాలవరకు మీకు (భవిష్యత్ లో సంఘటిత, అసంఘటిత రంగాలలోకి రాబోవు వారికి కూడా) ESI డిస్పెన్సరీ అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు నియోజకవర్గ నాయకులు పాల్గొని ఈ పోరాట గొంతుకలో పోరాటపటిమ చూపి విజయాన్ని సాధించారు.

## పార్టీ బలోపేతం కోసం ఉమిలాడ గ్రామంలో టెక్కలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ కణితి కిరణ్ పర్యటన



శ్రీకాకుళం ( జనస్వరం ) : సంతబొమ్మాళి మండలం ఉమిలాడ గ్రామంలో టెక్కలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ కణితి కిరణ్ కుమార్ గారు పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకుని ఈ మధ్య కురిసిన వర్షాలకి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. అలాగే చాలా మంది గ్రామస్తులు అర్హులైన కూడా తమకి ప్రభుత్వ పథకాలు అందడంలేదని కణితి కిరణ్ కుమార్ గారి దగ్గర ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం దృష్టికి గ్రామస్థుల సమస్యలు తీసుకువెళ్లి తగిన న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఎవరికి ఏం కష్టం వచ్చినా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కారం దిశగా పోరాడతానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో నియోజకవర్గ నాయకులు ముడిదాన రాంప్రసాద్, కొత్తూరు హరి, పుక్కళ్ళ సాయి, సాయి మహంతి, క్రాంతి, కల్లి యాదవ్ ఉమిలాడ జనసైనికులు సురపతి సత్యం, మూగి శివ మరియు గ్రామ జనసైనికులు పాల్గొన్నారు.

## జనసేన ప్రెస్ నోట్స్

గత కొన్ని దశాబ్దాలుగా చూడనంత వర్షం, వరదల మూలంగా హైదరాబాద్ నగరం అతలాకుతలం అయిపోయింది. ఇంతటినష్టం జరగడానికి ముఖ్య కారణాలు పట్టణ ప్రణాళిక లోపం ఒకటైతే... చట్టాలను తుంగలో తొక్కి నాలాలను ఆక్రమించడం మరొకటి. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నిబంధనలకు తూట్లు పొడవడం వల్ల జరిగిన నష్టం ఇది" అని,

ఇలాంటి నష్టం జరగకుండా ఆపగలం. వరదలు వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు నా తరపున, జనసేన పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఇటువంటి విపత్తులు సంభవించినప్పుడు బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత-ప్రభుత్వం, సమాజం, సంపన్నులపై ఏ స్థాయిలో, ఎంతవరకూ ఉంటుంది? విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం. సమస్య వచ్చినప్పుడు సంరక్షిస్తారనే ప్రభుత్వం అనే వ్యవస్థను ప్రజలు ఎన్నుకున్నారు.

# ఎన్నికల కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేసే నాయకులు వరద బాధితుల కోసం ఆ సొమ్ము బయటకు తీయాలి



జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కల్యాణ్ గారు స్పష్టం చేశారు. వరద బాధితులను ఆదుకొనే విషయంలో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ముందుండాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్నికల్లో గెలిచేందుకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసే నాయకులు ఇలాంటి ప్రకృతి విపత్తుల మూలంగా కష్టాల పాలవుతున్నవారిని గట్టెక్కించేందుకు, సిద్ధపడాలని సూచించారు. జనసేన పార్టీ సోషల్ మీడియాతో మాట్లాడుతూ వరదల పరిస్థితి, బాధితులను ఆదుకోవడంలో పాలకుల బాధ్యత, నేతలు పోషించాల్సిన పాత్ర తదితర అంశాలపై శ్రీ పవన్ కల్యాణ్ గారు వెల్లడించిన అభిప్రాయాలివి...

### అక్రమ కట్టడాలపై దృష్టిపెట్టాలి :

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ముంచెత్తిన వరదల మూలంగా హైదరాబాద్ నగరంలో దాదాపు 50 మంది వరకు చనిపోయారు. ఈ దుస్థితికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమా? ప్రజల అలసత్వమా? హైదరాబాద్ నగరానికి గతంలో వరదలు రావడం, ప్రాణనష్టం జరగడం చూశాం. కానీ ఈ స్థాయిలో ప్రాణనష్టం జరగడం ఎప్పుడు చూడలేదు. ఆరు దశాబ్దాల్లో ఎప్పుడు కూడా ఇంత వర్షపాతం నమోదు కాలేదు. ఇంతటి ప్రాణనష్టం జరగడానికి ముఖ్య కారణాలు పట్టణ ప్రణాళిక (అర్బన్ ప్లానింగ్) లోపం ఒకటైతే... చట్టాలను తుంగలో తొక్కి నాలాలను ఆక్రమించడం మరొకటి. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నిబంధనలకు తూట్లు పొడవడం వల్ల జరిగిన నష్టం ఇది. టీఆర్ఎస్ ప్రభుత్వం నాలాలపై అక్రమ కట్టడాలను తొలగిస్తామని చెప్పారు. కానీ ఎందుకు ముందుకు వెళ్లలేకపోయారో తెలియదు. ఇప్పటికైనా అక్రమ కట్టడాలపై దృష్టి సారించి సాధ్యమైనంత వేగంగా తొలగించాలి. ఇళ్లు కోల్పోయిన వారికి వేరే చోట ప్రత్యమ్నాయ, నివాస స్థలం ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఎంతో శ్రమించి పన్నులు కట్టి ఆర్థిక వ్యవస్థను ముందుకు నడుపుతున్నారు. ప్రతి పనికి విధివిధానాలు ఉన్నాయి. వాటన్నింటినీ సక్రమంగా అమలు చేయాల్సింది రాజకీయ వ్యవస్థ, బ్యూరోక్రసీ. ఇలాంటి విపత్కర సమయంలో అధికారం ఎవరి చేతుల్లో ఉందో వారే ముందుగా బాధ్యత తీసుకోవాలి. కొన్నిసార్లు అధికారంలో ఉన్నవారికి కొంత చేయూత అవసరం అవుతుంది. అలాంటి సమయంలో ఖచ్చితంగా పేరున్నవాళ్లు, సంపన్నులు ప్రభుత్వాలకు అండగా నిలబడాలి. రైట్ గవర్నమెంట్ ఉంటే చాలా బలంగా అందరూ ముందుకు వస్తారు. అసలు ఎవరు వచ్చినా రాకపోయినా ప్రభుత్వం తమ పని తాము చేసుకుపోవాలి. అందరి ఉమ్మడి డబ్బు అయిన ప్రభుత్వ ఖజానాలోని, నిధులను ఇష్టారాజ్యంగా కాకుండా ఇలాంటి విపత్తుల సమయంలో నిజమైన బాధితులకు అందేలా చూడాలి. అయితే దురదృష్టవశాత్తు కొన్ని దశాబ్దాలుగా ఆ విధంగా జరగకపోవడంతోనే సమస్యలు తలెత్తున్నాయి. దీంతో ప్రభుత్వ పాత్ర ఎంత అనే దృష్టి నుంచి వ్యక్తుల మీదకు వెళ్తుంది. ఇలాంటి సమయంలో మనందరం దృష్టి పెట్టాల్సింది ప్రభుత్వం ఎంత సమర్ధవంతంగా పనిచేస్తుంది, గత ప్రభుత్వాలు చేసిన తప్పులు ఏమిటి? లోటుపాట్లు ఏమిటి? ఆ ప్రభావం కూడా ఈ ప్రభుత్వంపై ఎంత పడిందని నిష్పక్షపాతంగా చూడాలి. నేనయితే అలానే చూస్తాను.

### సినీ రంగానికి పేరు మాత్రమే ఆకాశమంత :

చిత్ర పరిశ్రమలో చాలా సంపద ఉంటుందని అభిప్రాయం సాధారణ ప్రజానీకంలో ఉంది. విపత్తులు జరిగినప్పుడు సినిమా పరిశ్రమ స్పందిస్తూనే ఉంది. విరాళాలు ఇస్తూనే ఉన్నారు. కానీ సరిపోయినంత ఇవ్వడం లేదనే విమర్శ కూడా ఉంది. ఈ విషయాన్ని ఎలా చూస్తారు ?

సరిపోయినంత ఇవ్వడం లేదని నిర్ధారించేది ఎవరు? సరిపోయినంత ఇవ్వడం లేదని నిర్ధారించే వాళ్లు వారి జేబుల నుంచి పది రూపాయలైన తీసి ఇచ్చారా? కష్టపడి పని చేసి సంపాదించిన డబ్బు నుంచి కోటి రూపాయలు, పది లక్షలు రూపాయలు విరాళాలుగా ఇవ్వాలంటే అలాంటివారికి మనసు ఒప్పుతుందా? అలాంటిది నా వరకు నేను తీసుకుంటే కొన్ని కోట్లు విరాళాలు ఇచ్చాను. అలా చేయాలంటే చాలా పెద్ద మనసు కావాలి. చిత్ర పరిశ్రమలో పేరున్నంతగా డబ్బు ఉండదు. ఆరెంజ్ సినిమాకు నష్టం వస్తే అప్పులు తీర్చడానికి ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చింది. అత్తారింటికి దారేది సినిమా విడుదలకు ముందే పైరసీకి గురయి నెట్ లో రిలీజ్ అయితే కొనటానికి ఎవరూ ముందుకు రాలేదు. గ్యారంటీ సంతకాలు చేసి రిలీజ్ చేయాల్సి వచ్చింది. ఇన్ని కష్టనష్టాలు ఉంటాయి. సినిమా రంగంలోనివారికి పేరేమో ఆకాశానికి ఉంటుంది కానీ డబ్బు ఆ స్థాయిలో ఉండదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలా ఇక్కడ వేల కోట్ల రూపాయల టర్నోవర్ ఉండదు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వందల కోట్లు ఖర్చు చేస్తారు. ఆ స్థాయి డబ్బులు ఇక్కడ ఉండవు. నిజానికి సంపద అంతా రియల్ ఎస్టేట్ వ్యాపారుల దగ్గర, ఎలక్షన్ సమయంలో వందలకోట్లు ఖర్చు చేసిన రాజకీయ నాయకుల దగ్గర, వేల కోట్లు ఖర్చు పెట్టగలిగే రాజకీయ వ్యవస్థల దగ్గర, వేలకోట్లు విలువైన ఎగుమతుల వ్యాపారాలు చేసే, పారిశ్రామికవేత్తల దగ్గర, ఇన్ఫ్రాస్టక్చర్ రంగంలో ఉండే సంస్థలు, కాంట్రాక్టర్ల దగ్గర ఉంది. వాళ్లతో పోల్చితే సినిమా పరిశ్రమ చాలా చిన్నది. ఒక్క సీజన్‌లో అన్ని సినిమాలు ఖరీదు కలిపితే వెయ్యి కోట్లు కూడా ఉండవు. అది కూడా ఒక్కడి ఆస్తి కాదు. ఒక సినిమా నిర్మించాలంటే పదిమంది ప్రతిభావంతులు కలిసి పని చేయాలి. అన్ని సరిగ్గా కుదిరితే డబ్బులు మిగులుతాయి. ఒక వ్యక్తి సినిమా పరిశ్రమలో కోటి రూపాయలు సంపాదిస్తే అందులో జీఎస్టీ పోతుంది. అలాగే మిగిలిన ట్యాక్సులు అన్నిపోగా రూ.55 లక్షల నుంచి రూ.60 లక్షల వరకూ చేతికి అందుతుంది. అదే నష్టం వస్తే ఆ డబ్బు కూడా మిగలదు. ఎంతో మంది జీవితాలు కోల్పోయిన వారు ఈ రంగంలో ఉన్నారు. చిత్ర పరిశ్రమ చాలా సున్నితమైన పరిశ్రమ. సులువుగా టార్గెట్ చేసేస్తారు.

ఎన్నికల సమయంలో వందల కోట్లు మంచి నీళ్లలా ఖర్చు చేస్తున్నారు. గెలిచినా, ఓడినా భారీగా ఖర్చుపెడుతున్న వాళ్ళు అధికారం ఉన్నా, లేకున్నా ఇలాంటి పరిస్థితుల్లో ఆ డబ్బులు బయటకు తీయాలి. వారి వారి నియోజకవర్గాల్లో ఎలక్షన్ల పెట్టుబడి అనుకొని రూ. 50 కోట్లయినా ఖర్చు పెట్టి బాధితులకు అండగా ఉంటే బాగుంటుందని నా ఉద్దేశ్యం. కరోనా విపత్కర పరిస్థితుల్లో నేను కేంద్ర ప్రభుత్వానికి కోటి రూపాయలు ఇస్తే బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ గారు రూ. 25 కోట్లు ఇచ్చారు... సంతోషం. నా స్థాయి కోటి రూపాయలు, రెండు కోట్లు అయితే అక్షయ్ కుమార్ స్థాయి రూ. 25 కోట్లు. అందులో మెహర్బానీ ఏమీ లేదు. కొంతమంది విరాళాలు ఇవ్వరు. విరాళం అనేది స్పందించి ఇవ్వాలి తప్ప... మీరు ఎందుకు ఇవ్వలేదని అడగడానికి లేదు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థే కుదేలయ్యింది. బయట డబ్బు పుట్టడం కష్టంగా మారింది. పని చేద్దాం అంటే పని దొరికే అవకాశం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అదనంగా విరాళాలు అంటే అందరికి ఇబ్బందికర పరిస్థితే. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో అన్ని వర్గాల వారిని భాగస్వామ్యం చేయాలి. తెలంగాణ ప్రభుత్వానికి అన్ని వర్గాల వారు విరాళాలు ఇస్తున్నారు అంటే ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ప్రో యాక్టివ్. ఆయన అన్ని వర్గాల వారికి విజ్ఞప్తి చేశారు. మంత్రి వర్గంలోని సభ్యులు వారి వారి స్థాయిలో అన్ని వర్గాల వారికి చేరువవుతున్నారు. సంపద సృష్టించినప్పుడు కొంత సంపద ఇవ్వొచ్చు. కానీ సంపదే లేనప్పుడు విరాళాలు అడిగితే కొద్దిగా ఇబ్బందే. అయినా కేసీఆర్ లాంటి ప్రో యాక్టివ్ ముఖ్యమంత్రి అడిగారని ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అన్ని వర్గాల వారిని రీచౌట్ అవ్వాలి. రాజకీయాల్లోకి సేవ చేయాలనే భావనతో అందరు వచ్చారు. ఎలక్షన్ సమయంలో గెలిచినా, ఓడిపోయిన వందల కోట్లు ఖర్చు చేశారు. ఈ విపత్కర సమయంలో రాజకీయ నాయకుల వారి వారి నియోజకవర్గాల్లో ఎలక్షన్ కు పెట్టుబడి అనుకొని పెద్ద మనసుతో వరద బాధితులకు అండగా ఉండాలని కోరుతున్నాను.

## జనసైనిక్ పంచ్

బొడసింగి. రామకృష్ణ ( జనసైనికుడు )


- కుల, మత, ప్రాంత విద్వేషాలు మరిచి భారత పౌరులను ఏకతాటిపైకి తీసుకువచ్చే రాజకీయ వ్యవస్థ మారగలదా?
- నీతి, నిజాయితీ, సంమృద్ధి కలిగి ఉండి నా భారత పుత్రులు అని చెప్పుకుని సగర్వంగా రొమ్ము విరిచి తలపైకెత్తి ( భారత) జాతీయ పతాకం ఎగురగలదా?
- స్త్రీ వాంఛన లేకుండా అందరం ఒకే తల్లి బిడ్డలం అని చెప్పుకునే స్థాయికి చేరగలదా?
- రెండు కులాలు అని చెప్పుకునే దేశంలో (ధనిక, పేద) ధనికులకే అన్ని, పేదలకు కొన్ని అని కాకుండా సమానంగా ఎదిగేలా చూసే రాజకీయ వ్యవస్థ రాగలదా?
- స్వేచ్ఛ ఉంది కదా అని ఒకరిని అణగదొక్కి, ఇంకొకరిని పైకి తీసుకువచ్చే పత్రిక రంగం పై పౌరలకు నమ్మకం కుదిరే విధంగా మారగలదా?
- ఇక ఇంతే మారరు నాయకులు అని విసిగెత్తే ప్రజలకు నమ్మకం కలిగించే నాయకుడు రాగలడా?

**జనస్వరం ఈ - వార పత్రికకు సంపాదకీయం రాయాలన్న ఆలోచన, భావన మీలో ఉందా...**

**అయితే ఇంకెందుకు ఆలస్యం మీ భావాలను పంపించి మా జనస్వరం ద్వారా మీ స్వరాన్ని పాఠకులతో పంచుకోండి.**

వాట్సప్ : 9642067900
మెయిల్ : janaswaramnews@gmail.com

## రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలి : జనసేన బాడిశ మురళీకృష్ణ



కృష్ణా ( జనస్వరం ) : కృష్ణా జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలం తహశీల్దార్ కి వినతిపత్రం అందజేసిన జనసేన నాయకులు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బాడిశ మురళీకృష్ణ మాట్లాడుతూ భారీ వర్షాలు వరదలతో రైతులు పంట నష్టపోవడం చాలా బాధాకరమని పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్లో పెట్టుబడి పెట్టిన ప్రతి పైసా నీటి పాలైందని అన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం లేదని పరిహారం అందించడంలో ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తోందని మురళీకృష్ణ ఆరోపించారు. గత ఏడాది చెల్లించాల్సిన పరిహారం ఇప్పటికి చెల్లించలేదని రైతులు ఆవేదన చెందుతున్నారని ప్రధానంగా వరి పంట నీట మునిగి కుళ్ళిపోతుందని అదేవిధంగా ప్రతి పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలతో నల్లబారిపోయి పాడైపోయిందని తక్షణమే పరిహారం అందజేస్తే రైతులు తదుపరి పంటకు సిద్ధమవుతారన్నారు. పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించాలని జనసేన పార్టీ తరపున మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో మండల నాయకులు తునికిపాటి శివ, బత్తుల గోపయ్య, గోపి చారి మండల జనసైనికులు గుంజి యస్వంత్, నవీన్, గోపి, రాము తదితరులు పాల్గొన్నారు.

## జనసేవ కార్యక్రమంలో భాగంగా బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి రెండు ఆక్సిజన్ వెంటిలేటర్లను దానం చేసిన జనసేన నాయకులు జయరాం రెడ్డి



అనంతపురం ( జనస్వరం ) : అనంతపురం జిల్లాలో బత్తలపల్లి R.D.T హాస్పిటల్ కు రెండు నార్మల్ ఆక్సిజన్ వెంటిలేటర్ కిట్లను జనసేన నాయకులు లాయర్ శ్రీ ఆర్ జయరామి రెడ్డి గారు సహాయం చేయడం జరిగింది. ఈ సందర్భంగా R.D.T. డైరెక్టర్ తిప్పయ్య స్వామి గారు, జనసేన పార్టీ ఆశయాలను ఆచరిస్తూ జనసేన పార్టీ ఎదుగుదలకు అనునిత్యం కృషి చేస్తున్న అనంతపురం జిల్లా జనసేన నాయకులు లాయర్ శ్రీ జయరాం రెడ్డి గారికి R.D.T సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ, జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో లాయర్ మురళీకృష్ణ, K.ధనుంజయ, పసుపులేటి చంద్రశేఖర్ మరియు జనసేన కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కడప జిల్లాకు చెందిన జనసైనికుని నెల్లూరు జిల్లా జనసేన నాయకులు కోట్టే వెంకటేశ్వర్లు గారు రూ. 10000 ఆర్థిక సహాయం



కడప ( జనస్వరం ) : కడపకు చెందిన గజ్జల సాయి గత కొన్ని సంవత్సరాలుగా జనసేన పార్టీ కోసం పూర్తిస్థాయిలో పని చేస్తున్నాడు. ఐతే ఇటీవల సాయి తండ్రికి కరోనా వచ్చి తగ్గిపోగా అనంతరం గుండెకు సంబంధిత వ్యాధి బయటపడింది. ఈ విషయాన్ని కడప జిల్లా జనసేన పార్టీ నాయకులు తాతంశెట్టి నాగేంద్ర ద్వారా విషయం తెలుసుకున్న నెల్లూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు కోట్టే వెంకటేశ్వర్లు తీగల చంద్రశేఖర రావులు కడపకు వెళ్లి సాయి తండ్రిని పరామర్శించిన సాయి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆపరేషన్ నిమిత్తం పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ రవిప్రసాద్, మాజీ కడప జిల్లా జనసేన సేవాదళ్ కోఆర్డినేటర్ పండ్రా రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

## కరోనాతో మరణించిన దుర్గాప్రసాద్ కుటుంబానికి రూ. 50,000 ఆర్థిక సాయం అందించిన తాడేపల్లిగూడెం జనసేన ఇంచార్జి బొలిశెట్టి శ్రీనివాస్



తూర్పుగోదావరి ( జనస్వరం ) : తాడేపల్లిగూడెం నియోజకవర్గం జువ్వలపాలెం కి చెందిన జనసైనికుడు వట్టిపులుసు దుర్గాప్రసాద్ కరోనాతో అకాల మరణం చెందటం వల్ల దుర్గాప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి తనవంతు సహాయంగా 50,000 రూపాయలు ఆర్థిక సహాయం అందచేసి, ఆ కుటుంబానికి నేనున్నాను అని మనోధైర్యాన్ని ఇచ్చిన తాడేపల్లిగూడెం జనసేన ఇంచార్జి బొలిశెట్టి శ్రీనివాస్ గారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుగా స్పందించి పరిష్కారం చెప్పేది ఒక్క జనసేన మాత్రమే అని ఆయన అన్నారు. పార్టీలతో, కులాలతో మతాలతో సంబంధం లేకుండా అందరికి సమన్యాయం చేసేది ఒక్క జనసేన మాత్రమే అని చెప్పారు. కరోనా కష్టకాలంలో జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి పిలుపు మేరకు జనసేవ కార్యక్రమం ద్వారా ఎంతో మందికి సేవలు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జన సైనికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తమ గ్రామానికి రోడ్డు వేయాలని స్థానిక ఎంపీడీఓ కు వినతినిచ్చిన తొలుసూరుపల్లి గ్రామ జనసైనికులు



శ్రీకాకుళం ( జనస్వరం ) : టెక్కలి పట్టణానికి అనుసంధానంగా ఉన్న తొలుసూరుపల్లి పంచాయతీ పరిధిలోని ధర్మనీలాపురం గ్రామ ప్రధాన రహదారి అత్యంత అధ్వాన్నంగా మారి దారుణంగా తయారైందని జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ నాయకులు కూరాకుల యాదవ్, అట్టాడ శ్రీధర్ లు అన్నారు. రోడ్డు సమస్యపై స్థానిక ఎంపీడీఓ పి నారాయణ మూర్తికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ రోడ్డు వలన గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, రహదారి పొడవునా గ్రామానికి చేరేంతవరకు ఈ మధ్య కాలంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. రోడ్డు పూర్తిగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ముఖ్యంగా ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు ఈ రోడ్డు బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని అన్నారు.

## పునరావాస బాధితులకి నిత్యావసర సరుకులు అందించిన జనసేన నాయకులు



కృష్ణా ( జనస్వరం ) : కృష్ణ జిల్లా, కైకలూరు నియోజకవర్గం కలిదిండి బంక్ పేట వర్షానికి ముప్పుకు గురైన ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ నివాసం ఉంటున్న వారంతా ప్రభుత్వ బాలల హాస్టళ్లలో ఉంటున్నారని సీపీఎం మూర్తి గారి ద్వారా తెలుసుకుని జనసేన పార్టీ నాయకులు మండలి రాజేష్ గారి జన్మదిన సందర్భంగా వారికి బియ్యం కూరగాయలు సరుకులు అందజేశారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించడం జరిగింది. జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి పిలుపు మేరకు పునరావాస బాధితులకు సహాయం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలోమూర్తి గారు, నల్లగోపుల చలపతి గారు, నాగార్జున గారు, ఉదిసే రుక్మిణి గారు, వలవల రవితేజ గారు, గంధం సాయి గారు మరియు స్థానికులు పాల్గొన్నారు.


జనస్వరం
అక్షరమే ఆయుధం
www. Janaswaram.com

## పాఠకులకు మనవి

జనస్వరం ఈ - వార్తాపత్రిక (వార సంచిక) నందు మీ గళమైన వాణిని వినిపించాలనుకుంటున్నారా? మీ నియోజకవర్గ ప్రాంతంలో జరిగిన సంఘటనలను మన వార్తాపత్రిక నందు పంచుకోవాలనుకుంటున్నారా? మీ సమస్యలను మా పత్రిక నందు విన్నవించుకోవాలని అనుకుంటున్నారా? మీ స్వరంతో ప్రజలకు మరింత చేరువ అవ్వాలంటే మాకు ఈ క్రింది వాటికి పంపించండి.

/ 9642067900

janaswaramnews@gmail.com

జనస్వరం న్యూస్ వెబ్సైట్ మరియు వార్తాపత్రిక మరింత నాణ్యమైన వార్తాప్రపంచాన్ని మీ ముందుకు తీసుకురావడానికి మీ వంతు సహాయంగా ఆర్థికంగా చేదోడుగా నిలవాలని కోరుకుంటున్నాము.

Phonepe/Googlepay

UPI id : janaswaram@ybl